# బడిబాటతో సత్ఫలితాలు

- ఇప్పటికే 265 మంది.. మరింత పెరగనున్న అడ్మిషన్లు
- ఉపాధ్యాయుల ఇంటింటా ప్రచారం



ఇటీవల నిర్వహించిన బడిబాటలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు (ఫైల్)

**మణుగూరు టౌన్:** ఈ నెల 6 నుంచి 19 వరకు సర్కార్ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన 'బడిబాట' మండలంలో సత్ఫలితాలనిస్తోంది. సర్కార్‌బడుల్లో విద్యార్థులను చేర్పేందుకు ఉపాధ్యాయులు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం చేపట్టి గ్రామసభలు, ర్యాలీలు, ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి పాఠశాలల్లో సౌకర్యాలను వివరించారు. గతంలో మన ఊరు–మన బడి కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టారు. మండలంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు- 08, హైస్కూల్స్-04, ఎంపీపీఎస్ పాఠశాలలు 35 ఉండగా, అన్ని గ్రామాల్లో పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, విద్యపై ప్రచారం నిర్వహించారు. ప్రచారం సత్ఫలితాలిస్తుండటం ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రులు మొగ్గు చూపడంపై ప్రభుత్వ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యనందిస్తున్నాం. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు వివరించాం. సర్కారు బడుల్లోని కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి.

– స్వర్ణజ్యోతి, ఎంఈఓ

### విస్తృతంగా ప్రచారం..


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

మండలంలో బడిబాట నిర్వహించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 47 ఉండగా, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి సర్కార్ బడుల్లో సౌకర్యాలను, వసతులను వివరించారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో జూలై చివరి నాటికి 588 మంది కొత్త విద్యార్థులు చేరగా, మొత్తం 2,099 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. వారిలో ఈ ఏడాది పది తరగతి ఉత్తీర్ణులై 135 మంది వెళ్లగా, ఈ ఏడాది ఇప్పటివరకు కొత్తగా 265 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జూలై వరకు అడ్మిషన్ పొందే గడువు ఉండటంతో అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఈ ఏడాది అధిక శాతం ప్రభుత్వ పాఠశాలల నుంచి గురుకులాలకు వెళ్లడం, జూలై చివరి నాటికి ప్రభుత్వ స్కూళ్లకు కొత్త అడ్మిషన్లు మరింత పెరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## క్లుప్తంగా

### జూలై 8న అరుణాచలంకు ప్రత్యేక సర్వీస్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎం, తదితరులు

**అశ్వారావుపేట:** సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి జూలై 8న అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీస్ బయలుదేరనున్నట్లు డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అశ్వారావుపేట బస్టాండ్‌లో అరుణాచల యాత్ర కరపత్రాలను డీఎం విడుదల చేశారు. జూలై 8 రాత్రి 7 గంటలకు బస్ బయలుదేరి 10న అరుణాచలం చేరుకుని, గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి సత్తుపల్లి బయలుదేరుతుందన్నారు. యాత్ర చార్జి పెద్దలకు రూ.5 వేలు, పిల్లలకు రూ.2,510గా నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్‌లో సర్వీస్ నంబరు 99599 నందు రిజర్వేషన్ చేయించుకోవచ్చని, పూర్తి వివరాలకు 9866619189, 9542698518 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, కంట్రోలర్ ఆర్‌వీ.రావు తదితరులు ఉన్నారు.

### పాతదారినే కొనసాగించాలి..

**దమ్మపేట:** మండల కేంద్రంలోని బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడానికి పాతదారిని కొనసాగించాలని శుక్రవారం దమ్మపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బస్‌స్టేషన్ ప్రాంగణంలో, పెట్రోల్ బంక్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. బస్సులులోనికి వెళ్లే మార్గానికి అడ్డుగా ఉన్న బంక్ నిర్మాణాన్ని కొనసాగనివ్వమన్నారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి బస్సులులోనికి వెళ్లడానికి వేరే మార్గం ఏర్పాటు చేస్తామనగా గ్రామస్తులు ససేమీరా ఒప్పుకోలేదు. బస్సులు లోనికి వెళ్లే పాత మార్గాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బంక్ నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో అడ్డుకుంటామని తెలియజేశారు.

### స్పాట్ అడ్మిషన్ల గడువు పెంపు

**అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ):** మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులం డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల గడువును ఈ నెల 30 వరకు పొడిగిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ ఎస్‌కె.బురాన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీఎస్సీలో (ఎంపీపీఎస్, ఎంపీసీ, బీజెడ్‌సీ), బీకాంలో (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ గ్రూపులో ఖాళీలు ఉన్నాయని, కళాశాలలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

### సీపీఐ కమిటీ ఎన్నిక


మండల, పట్టణ కార్యదర్శులు రాజబాబు, సుధాకర్

**మణుగూరు టౌన్:** సీపీఐ మణుగూరు మండల, పట్టణ 21 మహాసభలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు పట్టణ కార్యదర్శిగా మూడో సారి ఏకగ్రీవంగా దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శిగా జక్కుల రాజబాబులను ఎన్నుకున్నట్లు శుక్రవారం నాయకులు ప్రకటించారు. పట్టణ సహాయ కార్యదర్శిగా చింతల దశరథం, తోట రమేశ్‌లతో పాటు 60 మందితో పట్టణ కౌన్సిల్ 11 మందితో కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల సహాయ కార్యదర్శులుగా ఎడారి రమేశ్, వేర్పుల నరేశ్‌లను ఎన్నుకోగా, 60 మందితో కౌన్సిల్, 21 మందితో కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య, నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, సర్వర్, వై.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### మసీద్ సదర్‌గా రసూల్

**చంద్రుగొండ:** మండలంలోని తిప్పనపల్లి గ్రామంలోని కౌసర్ మసీద్ సదర్‌గా ఎస్డీ రసూల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు సమావేశమై సదర్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ అలీం, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె.అజీజ్, సెక్రటరీగా బషార్, జాయింట్ సెక్రటరీలుగా అజహరుద్దీన్, ఆరీఫ్‌లను ఎన్నుకున్నారు.

### మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి

**బూర్గంపాడు:** మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని బూర్గంపాడు ఎస్సై రాజేశ్ కోరారు. బూర్గంపాడులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి శుక్రవారం మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల కేసులలో పట్టుబడితే జైలుశిక్షలతో పాటుగా ఆస్తుల జప్తు చేస్తారన్నారు. ఎస్సై నాగభిక్షం, హెడ్ కానిస్టేబుల్స్ నాగేశ్వరరావు, సత్యమూర్తి, మంగీలాల్, పాపయ్య, స్వామి పాల్గొన్నారు.

## ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

**బూర్గంపాడు:** పోడు సాగుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు బూర్గంపాడులో జరుగుతున్న సీపీఎం శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్, రెవెన్యూ పట్టాలు ఉండి రైతు భరోసా తీసుకుంటున్న రైతుల భూముల్లో పంటలు సాగు చేసుకోకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవటం సరికాదన్నారు. ఎన్నికల హామీల్లో పోడు రైతులకు పట్టాలిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీ.నర్సారెడ్డి, వెంకటేశ్వర్లు, బయ్యా రాము, ఎస్‌కె. అబీదా తదితరులు పాల్గొన్నారు.

**పార్టీని బలోపేతం చేయాలి**

**దుమ్ముగూడెం:** మండలంలోని గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీబీ మాజీ చైర్మన్, సీపీఎం నాయకుడు ఎలమంచిలి రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను విజయవంతం చేయాలన్నారు. మండలంలో అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఈ తరగతుల్లో పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలగాని బ్రాహ్మాచారి, ఎంబీ.నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎలమంచిలి వంశీ, మర్మం చంద్రయ్య, కోర్స చిలకమ్మా, నాయకులు బొల్లి సత్యనారాయణ, ఎలమంచిలి శీను బాబు, కొమరం చంటి, ఖాదర్ బాబు, మర్మం సమ్మక్క, మడే రాజేష్, తోడం తిరుపతిరావు, సోయం పార్వతి, అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

### వేతనాలు పెంచాలి


సమ్మె నోటీస్ అందజేస్తున్న గ్రామదీపికలు

**దమ్మపేట:** లేబర్‌కోడ్లు అమలుకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెనోటీస్‌ను సెర్ప్ ఏపీఎం వినోద్ క్రాంతికి మండల గ్రామ దీపికల సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో వీఓఏల మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ... వీఓఏలకు కనీస వేతనంగా రూ.20,000లు చెల్లించి, ఉద్యోగ, ఆరోగ్య భద్రతలను కల్పించాలని డిమాండ్ చేశారు. రద్దుచేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా జూలై 9 నుండి సార్వత్రిక సమ్మెను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ, శ్రీలత, భద్రమ్మ, పద్మ, చెన్నమ్మ, శ్రీదేవి, పుష్ప పాల్గొన్నారు.

### చర్యలు తీసుకోవాలి

**ములకలపల్లి:** అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్కా అజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ భూక్యా గనియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్మిషన్ ఫీజులు, బుక్స్, ట్రాన్స్‌పోర్ట్ పేరిట భారీ వసూళ్లకు పాల్పడుతున్నారని, వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు.

### డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

**భద్రాచలంటౌన్:** కేయూ డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలలో భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శుక్రవారం ప్రకటించిన ఫలితాలలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యధిక గ్రేడ్లు అత్యధిక ఉత్తీర్ణత శాతంతో ఫలితాల, మార్కులతో డివిజన్‌లోనే అగ్రగామిగా నిలిచింది. బీఎస్సీ ఎంసీసీఎస్‌లో హరిహరన్ 8.75 , బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో అరుణకుమారి 8.70, బీకాంలో యాసిన్ 8.41. బీఏలో రోహిణి 7.9, గ్రేడ్ పాయింట్లు సాధించారు. అత్యధిక గ్రేడ్‌పాయింట్లు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

### భద్రాద్రి అభివృద్ధికి కృషి చేయాలి


చిన్నారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

**భద్రాచలంటౌన్:** తెలంగాణ ప్రణాళికా కమిషన్ వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డిని భద్రాచలం పట్టణానికి చెందిన భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్ రెడ్డి, వ్యాపారవేత్త కొదుమూరి నరసింహామూర్తి కలిశారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భద్రాద్రి సమస్యలను వివరించి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. శంకర్‌కు వినతిపత్రం అందించారు. పూడిక తీయడంతోపాటు దారి ఆక్రమణకు గురైందని, సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. వాసు, సత్యనారాయణ, పుల్లారావు, నర్సింహారావు, అప్పాజీ ఉన్నారు.

### కాల్వను పునరుద్ధరించండి

**చంద్రుగొండ:** మండలంలోని మద్దుకూరులో ప్రాజెక్ట్ నుండి అయన్నపాలెంలోని గంటె వీరయ్య కుంటకు వచ్చే నీటి కాల్వను పునరుద్ధరించాలని రైతులు శుక్రవారం నీటిపారుదల శాఖ డీఈ కృష్ణ


### వైద్యశిబిరం


శిబిరంలో మున్సిపల్, వైద్య సిబ్బంది

**మణుగూరు రూరల్ :** మున్సిపాలిటీ కార్యాలయంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కమిషనర్ ప్రసాద్ సమక్షంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిశాంత్‌రావు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా లంకమల్లారం గిరిజన బాలికల వసతిగృహం, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర వసతిగృహాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంకీర్తన, మున్సిపల్ సిబ్బంది, వైద్యసిబ్బంది, వార్డెన్లు పాల్గొన్నారు.

## వితరణ..

**ఆదివాసీ పిల్లలకు పుస్తకాలు..**


పినపాక: బుక్స్ అందజేస్తున్న పోలీసులు

**పినపాక:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని వలస ఆదివాసీ గ్రామాలైన ముద్దులగూడెం, టేకులగూడెం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. అందులో భాగంగా సీఐ వెంకటేశ్వర్లు గ్రామంలోని ఆదివాసీలతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ మావోయిస్టులకు సహకరించవద్దని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తూ జైలు పాలు కావొద్దని సూచించారు. ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

**దోమ తెరలు..**


అశ్వారావుపేటరూరల్: దోమ తెరలను అందజేస్తున్న జక్కుల రాంబాబు

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలోగల వలస ఆదివాసీ గ్రామమైన రేగళ్లకు చెందిన ఆదివాసీలకు నారాయణపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు జక్కుల రాంబాబు దోమతెరలు పంపిణీ చేశారు. దోమతెరలను వినియోగించి, దోమల నుంచి రక్షణ పొందాలని ఆయన కోరారు.

## వైభవంగా రామయ్య పునర్వసు కల్యాణం


తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

**దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారికి మాసకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు గోదావరి జలాలతో స్వామి వారికి పంచామృతాలతో విశేష అభిషేకం తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పునర్వసు నక్షత్ర కల్యాణ మహోత్సవమును అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మాంగల్యధారణ అనంతరం కల్యాణ తలంబ్రాలు ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు మదన మోహనాచార్యులు, భార్గవాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జారె

**అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ):** రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలంలోని రాజాపురం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం రెండు పరుగులు తీస్తున్నాయన్నారు. అన్ని వర్గాలను సమానంగా చూస్తూ వారి అభివృద్ధి లక్ష్యంగా పాలన చేస్తున్నామన్నారు. అధికారులతోపాటు నాయకులు వెంకటేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, రాము, సత్యనారాయణరెడ్డి, భీముడు పాల్గొన్నారు.

## సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండండి


మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

**చంద్రుగొండ:** సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు. సైబర్ సురక్షత జాతీయ భద్రత అనే అంశంపై శుక్రవారం మండలంలోని రావికంపాడు గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సై శివరామకృష్ణతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఫ్రైడే డ్రైడే కార్యక్రమం..

**పినపాక:** దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు మధు అన్నారు. శుక్రవారం మండలంలోని సీతంపేట, భూపాలపట్నం గోపాల్‌రావుపేట, తోగూడెం గ్రామాల్లో నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి వాటి ద్వారా వచ్చే ఇబ్బందులను వివరించారు.

**వైద్యశిబిరం**


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**దమ్మపేట:** మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా గ్రామంలో డ్రైడేఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని పారబోయించారు. అనంతరం వైద్యశిబిరంలో వైద్యులు డాక్టర్ దివాకర్ పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. రోగ సంబంధిత లక్షణాలు ఉన్న వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

### సమస్యలు పరిష్కరించాలి


కమిషనర్‌తో బీఆర్ఎస్ నాయకులు

**అశ్వారావుపేట:** అశ్వారావుపేట మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమితులైన నాగరాజును బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కలిసి జ్ఞాపికను అందజేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అధ్యక్షులు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశరావు, నాయకులు సత్యవరపు సంపూర్ణ, చిట్టూరి ఫణీంద్ర, మందపాటి మోహన్‌రెడ్డి, జుజ్జూరపు శ్రీరామమూర్తి, తగరం జగన్నాథం, తాళం సూరి, స్నేహిత్ ఉన్నారు.

### చలో పూసుగూడెంను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**మణుగూరు రూరల్:** ఈ నెల 30న తలపెట్టిన చలో పూసుగూడెం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా నుండి ప్రవహిస్తున్న సీతారామ ప్రాజెక్ట్ సాగు జలాలను స్థానిక రైతాంగానికి ఇవ్వకుండా పక్క జిల్లాలకు తరలించుకుపోవడం దుర్మార్గమని, ఈ చర్యను ఖండిస్తూ ములకలపల్లి మండలం పూసగూడెం సీతారామ ప్రాజెక్ట్ శిలాఫలకం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్, నాయకులు ఎడవల్లి వెంకటయ్య, ముద్దంగుల కృష్ణ, ఎస్సీ, బీసీ సెల్ మండల అధ్యక్షులు వేర్పుల సురేష్, అక్కి నర్సింహారావు, జావిద్ పాషా, శ్రీను, బోశెట్టి రవి, మూస, వీరన్నబాబు, బాబురావు, రామారావు, సురేష్, రామకోటి, శంకర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం:** చలోపూసుగూడెంను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ జానీ పాషా అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. గెలుపుకోసం అనేక వాగ్దానాలు చేసి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమయిందన్నారు. ఈ కార్యక్రమంలో తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, కాటిబోయిన వెంకటేశ్వర్లు, సోడి కొండయ్య, రాయపూడి పుష్పరాజు, పూసం రాజేష్, కొడిమి సాయమ్మ, సరియం నాగమ్మ, కొమరం జానకి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

## రోడ్ల దుస్థితిని పట్టించుకునేదెవరు?


బంగారుగూడెం రహదారిపై గుంతల్లో నిలిచిన నీరు


గుంతలమయంగా మారిన పద్మాపురం వద్ద ప్రధాన రహదారి

**కరకగూడెం:** గతంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో అనేక ప్రాంతాల్లో రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టి ఏడాది కావస్తున్నా ఆ దెబ్బతిన్న రోడ్లను బాగుచేసేవారు కరువయ్యారు. ఫలితంగా ప్రజలు, నిత్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బంగారుగూడెం బ్రిడ్జి, పద్మాపురం సమీపంలోని చప్టా వద్ద రోడ్ల పరిస్థితి దయనీయంగా మారి ప్రమాదాలకు నిలయంగా తయారైంది. రోడ్లపై గుంతలు ఏర్పడడం ప్రధాన రహదారి కావడం నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండంతో ఇబ్బందులు తప్పడం లేదు. దెబ్బతిన్న రోడ్ల శాశ్వత మరమ్మతులపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వహించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు వేడుకుంటున్నారు.